క్లుప్తంగా

పాఠశాల సందర్శన



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంపీపీ

గన్నేరువరం: మండలంలోని హన్మాజీపల్లె గ్రామం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ఎంపీపీ మల్లారెడ్డి సందర్శించారు. ఈసందర్భంగా మధ్యాహ్న భోజనంతో పాటు పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, తరగతి గదులను పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహారం అందించాలని, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెదిరలో భూసేకరణ



భూసేకరణ చేస్తున్న రెవెన్యూ అధికారులు

రామడుగు: కరీంనగర్–జగిత్యాల జాతీయ రహదారి నిర్మాణం కోసం మండలంలోని వెదిర గ్రామ పరిధిలో సోమవారం రెవెన్యూ అధికారులు భూసేకరణ కార్యక్రమం నిర్వహించారు. గతంలో వెదిర గ్రామ పరిధిలో భూసేకరణ నిలిచిపోయింది. కార్యక్రమంలో ఆర్‌ఐ రజనీ, డీఐ సర్వేయర్ రాకేశ్ పాల్గొన్నారు.

‘ధరణి’ రద్దు చేయాలి



మాట్లాడుతున్న కాంతాల అంజిరెడ్డి

గన్నేరువరం: భూ ప్రక్షాళనలో భాగంగా ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి వ్యవస్థను రద్దు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కాంతాల అంజిరెడ్డి కోరారు. ఈ సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో మాట్లాడారు. ధరణి ప్రవేశపెట్టినప్పటి నుంచి రైతులు భూ సమస్యల పరిష్కారానికి ఆగమాగం అవుతున్నారని, దీనివల్ల రైతులకు ఒరిగిందేమి లేదని విమర్శించారు. ప్రతి చిన్న భూ సమస్యకు కలెక్టర్ కార్యాలయానికి వెళ్లడం ఇబ్బంది మారిందని, ఐదేళ్లుగా భూ సమస్యల పరిష్కారానికి అరిగోసపడుతున్నారని, తిరిగి తహసీల్దార్లకు బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల సహాయ కార్యదర్శి చొక్కల శ్రీశైలం, యువజన నాయకుడు ఆంజనేయులు, గర్శకుర్తి శ్రీనివాస్, పబ్బితి సాగర్ రెడ్డి, బోయిని మల్లయ్య, జాలి గోపయ్య, బొమ్మడి సంపత్‌రెడ్డి, రవి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మల్లేశం

గంగాధర: మండలంలోని మధురానగర్ చౌరస్తాలోని బస్టాండ్ వద్ద గంగాధర లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం క్లబ్ అధ్యక్షుడు గుర్రం బాపురెడ్డి ప్రారంభించాడు. ప్రయాణికులకు తాగునీటి సౌకర్యం కోసం చలివేంద్రం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. క్లబ్ సభ్యులు గుడి అనంతరెడ్డి, విజయేందర్‌రెడ్డి, ఎర్రం లక్ష్మణ్, ఉడుత శ్రీనివాస్, ఇప్పలపల్లి లక్ష్మణ్, కరీంనగర్ 2 డిపో మేనేజర్ పాల్గొన్నారు.

చొప్పదండి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఐజల్ స్టేషన్ వాటర్ ప్లాంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆర్టీసీ కరీంనగర్ 2 డిపో మేనేజర్ మల్లేశం సోమవారం ప్రారంభించారు. వేసవిలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఐజల్ వాటర్ యజమాని పబ్బ సత్యనారాయణ పటేల్ చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో లక్ష్మి కాంతరావు, బాలయ్య, గుడాల సుధీర్, రాజలింగం, పెద్దెళ్ళి శ్రీనివాస్, మహేందర్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న కంసాల శ్రీనివాస్

రామడుగు: యువత రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించడానికి ముందుకురావాలని ఆధార్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు, కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని దత్తోజీపల్లిలో సోమవారం యువకుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశంలో నాయకులు తోడేటి బాబు, సంపతి అశోక్, సాంబయ్య, కోటేశ్వర్, వేణు, అంజి, సాయి పాల్గొన్నారు.



సీడీ ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, తదితరులు



గంగవ్వతో ఎమ్మెల్సీ కవిత

ఆటపాటలతో జోష్

తిమ్మాపూర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని ఎల్‌ఎండీకాలనీ రాంలీలా మైదానంలో రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన నారీ ప్రభాతభేరి, స్త్రీశక్తి పురస్కారాల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కవిత, మంత్రులు గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్ హాజరయ్యారు. మహిళా సంఘాల సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తల తో సందడి నెలకొంది. ప్రజాప్రతినిధులు అమరవీరుల స్తూపానికి నివాళి అర్పించారు. యూ ట్యూబర్లు గంగవ్వ, కనకవ్వ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మహిళా సంఘాల సభ్యులకు చెక్కులు అందించారు. ఆటపాటలతో జోష్ నెలకొంది.



మహిళా సంఘాలకు చెక్కు అందజేత







అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, కనకవ్వ, మహిళా అధికారులకు సన్మానం

తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట్ క్లస్టర్ పరిధి రైతువేదికలో కొండాపూర్, నవాబుపేట్ గ్రామాల రైతులకు వరిలో తెగుళ్ల నివారణపై సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. అగ్గితెగులు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి కె. రంజిత్‌కుమార్ సూచించారు. మొదటి దశలోనే గుర్తించి సూచించిన మందులు పిచికారీ చేయాలన్నారు. గ్రామాల్లో ఉండే ఏఈవోల సలహాలు, సూచనలతో పంటలను రక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల, గ్రామ కో ఆర్డినేటర్లు



మాట్లాడుతున్న ఏవో రంజిత్‌కుమార్

తిరుపతి, రాజేందర్‌రెడ్డి, రాజేశ్వర్లు, సర్పంచులలు సుద్దాల ప్రవీణ్‌కుమార్, పెద్దపెల్లి భవాని అరుణ్‌కుమార్, ఏఈఓ సాయి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో ఎదగాలి



ప్రమీలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



మహిళా టీచర్లను సన్మానిస్తున్న హెచ్‌ఎం

చిగురుమామిడి: మహిళలు అన్నిరంగాల్లో ఎదగాలని, ఆర్థిక, సామాజిక, రాజకీయంగా అభివృద్ధి చెందినపుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని మండలంలోని కొండాపూర్ సర్పంచ్ పెద్దపల్లి భవానిఅరుణ్‌కుమార్ అన్నారు. సోమవారం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం బి. కిషన్‌నాయక్ అధ్యక్షతన మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. చట్టసభల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. మహిళలు అత్యాచారం, హత్యలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహిళా టీచర్లు ఎం. స్వరూప, జి. సునీత, కల్యాణి, రజిని, సంధ్యారాణిని శాలువాలతో సన్మానించి మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, దుబ్బాక బాల్‌రెడ్డి, అజ్గర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: మండల కేంద్రంలోని విన్నర్స్ పాఠశాలలో సోమవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పంజాల ప్రమీలను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. అనంతరం ముందస్తుగా హోలీ వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జగన్‌మోహన్‌గౌడ్, హెచ్‌ఎం భారతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆందోళనకు గురికావొద్దు

చొప్పదండి: పదో తరగతి పరీక్షలకు విద్యార్థుల సన్నద్ధతపై జిల్లా విద్యాధికారి సోమవారం మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించారు. చొప్పదండి బాలుర ఉన్నత పాఠశాల, ఆర్నకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బోధనను పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో ముఖాముఖి నిర్వహించి తగు సూచనలు చేశారు. విద్యార్థులు భయాందోళనలకు గురికాకుండా వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. వెంట హెచ్‌ఎం కరుణ, తదితరులున్నారు.



ఆర్నకొండ పాఠశాలలో విద్యార్థులు, టీచర్లతో మాట్లాడుతున్న డీఈవో జనార్దన్ రావు

30న వైఎస్సార్‌టీపీ బహిరంగ సభ



మాట్లాడుతున్న నాయకులు

చొప్పదండి: గంగాధర మండల కేంద్రంలో 30న నిర్వహించే వైఎస్సార్‌టీపీ బహిరంగ సభకు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులను ఆహ్వానించామని వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తడగొండ సత్యరాజ్‌వర్మ తెలిపారు. ఈమేరకు హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయానికి పార్టీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి రాజేందర్‌రెడ్డితో కలిసి నాయకులు తరలివెళ్లారు. నియోజకవర్గంలోని 327 బూత్ కమిటీలను నియామకం చేయనున్నామని చెప్పారు. జగిత్యాల జిల్లా మహిళా అధ్యక్షురాలు గాదె స్రవంతి, దాసరి రవిశాస్త్రి, నేరెళ్ళ స్వామి, కొల్లెం ప్రవీణ్ రెడ్డి, ఎల్లాల శ్రీనివాస్ రెడ్డి, తదితరులు వెళ్లిన వారిలో ఉన్నారు.

మున్సిపల్ సర్వసభ్య సమావేశం వాయిదా

హుజూరాబాద్: హుజూరాబాద్ మున్సిపల్ సర్వసభ్య సమావేశం సోమవారం కోరం లేక వాయిదా పడింది. అవిశ్వాస నోటీస్ ఇచ్చిన మెజారిటీ కౌన్సిలర్లు సమావేశానికి వచ్చేది లేదని స్పష్టం చేశారు. చైర్‌పర్సన్ గందె రాధిక అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశానికి ఎనిమిది మంది మాత్రమే హాజరయ్యారు. దీంతో సమావేశం కోరం లేక వాయిదా వేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ సల్వాది సమ్మయ్య ప్రకటించారు. ఈ సందర్భంగా 21 మంది కౌన్సిలర్లు విలేకరులతో మాట్లాడారు. ఫిబ్రవరి 2న మెజార్టీ కౌన్సిలర్లు చైర్‌పర్సన్ గందె రాధికపై అవిశ్వాసం ప్రకటిస్తూ కలెక్టర్‌కు నోటీసు ఇచ్చామని గుర్తు చేశారు. చైర్‌పర్సన్‌ను పదవి నుంచి తొలగించేంతవరకు మున్సిపాలిటీలో ఏర్పాటు చేసే ఎలాంటి సమావేశాలకు హాజరయ్యేది లేదని గతంలోనే చెప్పామని పేర్కొన్నారు. తిరిగి సమావేశాన్ని ఈ నెల 8న నిర్వహించనున్నట్లు కమిషనర్ సమ్మయ్య తెలిపారు.

కళాకారులకు గౌరవం

వీణవంక: తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కళాకారులకు గుర్తింపు, గౌరవం వచ్చిందని ఎంపీటీసీల ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు సంజీవారెడ్డి అన్నారు. మండలంలోని ఘన్ముకులలో చిడతల రామాయణం కళాకారులను ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు సన్మానించారు. కళాకారుల కార్పొరేషన్, ప్రత్యేక బడ్జెట్ కేటాయించామన్నారు. గ్రామాల్లోని కళాకారులు ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. ధర్మాన్ని రక్షిస్తే ధర్మం మనల్ని రక్షిస్తుందని కళాకారులు అనేక పాత్రలతో తెలపాలన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి, ఉపసర్పంచ్ కొమురయ్య, కాంతాల రాజిరెడ్డి, రాఘవరెడ్డి, సదాశివరెడ్డి, కోటేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 44 మందికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను సోమవారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు చెందినవారికి వైద్య ఖర్చులకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అభినందన



పురస్కారం అందుకుంటున్న విద్యార్థిని

జమ్మికుంట: బాలికల విద్యను ప్రోత్సహించేందుకు కరీంనగర్‌లోని కోరమండల్ సంస్థ జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను ఎంపిక చేసి కలెక్టర్ ఆర్వీ కర్ణన్ చేతుల మీదుగా నగదు, ప్రశంసా పత్రాలు అందజేశారు. జమ్మికుంట బాలికల ఉన్నత పాఠశాలలోని సమీనా బేగం ప్రథమ, శ్రీవిద్య ద్వితీయ ప్రతిభా పురస్కారాలు అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం విద్యార్థినులకు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. హెచ్‌ఎం సుధాకర్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రామేషాచార్య, సతీష్, సారంగపాణి, ఐలయ్య, సారయ్య ఆవినాశ్, భాగ్యలక్ష్మి, వనజ, రమాదేవి రామాకుమారి, రేణుక విద్యార్థులను అభినందించారు.

నియామకం

మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సాల్మోన్



హుజూరాబాద్‌రూరల్: మాదిగ సమాజాభివృద్ధి సాధన కోసం మాదిగ హక్కుల దండోరా నిరంతరం పనిచేస్తుందని వ్యవస్థాపక అధ్యక్షుడు యాతకుల భాస్కర్ మాదిగ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా సంఘం బలోపేతానికి గతనెల 27, 28 తేదీల్లో ఖమ్మంలో మూడో ఆవిర్భావ సభలో నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నామని తెలిపారు. కరీంనగర్ జిల్లాలోని పోతిరెడ్డిపేట గ్రామానికి చెందిన కాలేశ్వరపు సాల్మోన్‌ను మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నామని తెలిపారు. సాల్మోన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. మాదిగల హక్కుల సాధనకు కృషిచేస్తానని పేర్కొన్నారు.

వీడ్కోలు హంగామా



గంగాధర: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయిలో రాణించాలని నరేంద్ర విద్యాలయం నిర్వాహకులు రాజేశం, గోపాల్‌రెడ్డి సూచించారు. మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలో ఉన్న పాఠశాలలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువే లక్ష్యంగా ముందుకుసాగాలన్నారు. అనంతరం విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఆధ్యాత్మికం

వైభవంగా డోలోత్సవం



డోలోత్సవం నిర్వహిస్తున్న నిర్వాహకులు

రామడుగు: మండలంలోని వెలిచాల శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం స్వామివారి డోలోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం బండ్లు తిరిగే కార్య క్రమం చేపట్టారు. దేవాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రావు, సర్పంచ్ సరోజన, నాయకులు సంజీవరావు, రవీందర్‌రావు భక్తులున్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభం

చొప్పదండి: పట్టణంలోని సాయినగర్‌లో నిర్మించిన సాయిబాబా ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఆలయ నిర్వాహకులు హోమం, సాయంత్రం పట్టణంలో సాయి భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం భక్తులకు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. మంగళవారం గణపతి హోమం యాగశాల ప్రవేశం, దీక్షాధారణ కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ, ఆలయ చైర్మన్ హన్మంతరెడ్డి, నిర్వాహకులు లింగయ్య, రాము, ప్రతిష్ఠాపనాచార్యులు నందగిరి ఫణిశర్మ, శ్యాంకుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో సాయి మహిళా భక్తులు, సాయి భజన మండలి సభ్యులు శోభాయాత్ర నిర్వహించారు. కోలాటంతో సాగిన శోభాయాత్రను పట్టణ ప్రజలు ఆసక్తితో తిలకించారు.

యాలాల మల్లన్నస్వామి జాతర

చిగురుమామిడి: మండలంలోని గాగిరెడ్డిపల్లి గ్రామంలో సోమవారం యాలాల మల్లన్నస్వామి జాతర ఘనంగా నిర్వహించారు. ఆలయం ఎదుట ఒగ్గు కళాకారులు పెద్దపట్నం వేసి స్వామివారి ప్రాశస్త్యం వివరించారు. యాదవులు, గ్రామస్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ కొత్త వినీతశ్రీనివాస్‌రెడ్డి దంపతులు, బీజేపీ నాయకుడు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి మల్లన్నను దర్శించుకున్నారు. వీరికి సర్పంచ్, ఆలయ పూజారులు, కమిటీ సభ్యులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.



తిమ్మాపూర్: కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



చొప్పదండి: పూజలు చేస్తున్న భక్తులు, తదితరులు



పూజలు చేస్తున్న ఎంపీపీ వినీతశ్రీనివాస్‌రెడ్డి

కల్యాణం.. కమనీయం

తిమ్మాపూర్: మండలంలోని మొగిలిపాలెంలో శ్రీచెన్నకేశవస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై పండితుల వేద మంత్రోచ్చారణ మధ్య కల్యాణం జరిపించారు. కల్యాణ ఉత్సవానికి ఎన్ఆర్‌ఐ పిన్నింటి శైలజ నరసింహారెడ్డి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు తీసుకువచ్చారు. కల్యాణం అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. భక్తులందరికీ అన్నదానం చేశారు. వేడుకల్లో సర్పంచ్ మోరపల్లి సుష్మిత రెడ్డి, ఎంపీటీసీ పాశం తిలక్‌ప్రియారెడ్డి, ఉప సర్పంచ్ మర్రి కొమురయ్య, నాయకులు, మోరపల్లి రమణారెడ్డి, కమిటీ సభ్యులు వందల మంది భక్తులు పాల్గొన్నారు.



చొప్పదండి: కోలాటంతో శోభాయాత్ర నిర్వహిస్తున్న మహిళా భక్తులు

విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలి



ఐలయ్యను సన్మానిస్తున్న భూంరెడ్డి

చిగురుమామిడి: విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలని ప్రముఖ మానసిక నిపుణుడు, జ్ఞాపకశక్తి ట్రైనర్, మోటివేషనల్ స్పీకర్ సోరుపాక ఐలయ్య అన్నారు. సోమవారం మండలంలోని బొమ్మనపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు జీవితంలో వచ్చే ఒడిదొడుకులు, సమస్యలను ఎదుర్కొనే పద్ధతులు, సాధనకు ఆచరించే విధానాలను వివరించారు. నమ్మకంతో పనిచేస్తే ఏదైనా సాధించవచ్చని, మనకు మనం తక్కువ అంచనా వేసుకోవద్దన్నారు. ఇతరులతో పోల్చుకోవద్దన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భూంరెడ్డి, ఎంపీటీసీ మిట్టపెల్లి మల్లేశం, ఉపసర్పంచ్ పెండ్యాల శారదసదానందం, హెచ్‌ఎం రాజమౌళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం ఐలయ్యను ఘనంగా సన్మానించారు.

బహిరంగ సభ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్

శంకరపట్నం: కరీంనగర్‌లో 9న నిర్వహించే హాథ్ సే హాథ్ జోడో యాత్ర బహిరంగ సభను విజయవంతం చేయాలని పీసీసీ సభ్యుడు, మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ కోరారు. కేశవపట్నంలో సోమవారం మాట్లాడారు. కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో సోనియా గాంధీ ఇచ్చిన మాట ప్రకారం ప్రత్యేక రాష్ట్రం ఇచ్చారని గుర్తు చేశారు. అదే స్థలంలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల బహిరంగ సభకు ఛత్తీస్‌ఘడ్ ముఖ్యమంత్రి భూపేశ్‌భగేల్, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీనియర్‌కాంగ్రెస్ నేతలు హాజరవుతారని పేర్కొన్నారు. బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మండల అధ్యక్షుడు బస్వయ్య, మల్లారెడ్డి, జహంగీర్, రాజిరెడ్డి,చందు, సంతోష్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల్లో 10 జీపీఏ సాధించాలి

ఇల్లందకుంట: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్(రిటైర్డ్ టీచర్) సోమవారం పరీక్షా ప్యాడులు అందజేశారు. రాబోయే పరీక్షల్లో విద్యార్థులు 10 జీపీఏ సాధించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పరీక్షా ప్యాడులు అందిస్తున్న జగదీశ్వర్